సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 19 । మే । 2024



చీనీ టన్ను రూ.36,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36,500, కనిష్టం రూ.16 వేలు, సరాసరి రూ.23 వేలు పలికాయి.



చెన్నకేశవా.. కరుణచూపవా

ధర్మవరంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం స్వామివారు కల్పవృక్ష, హనుమద్ వాహనాలపై దర్శనమిచ్చారు.

8లో



జిల్లావ్యాప్తంగా శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై కొన్ని మండలాల్లో మోస్తరు నుంచి తేలిక పాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ.వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

గురుకులాల్లో ఇంటర్ మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్



అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు గురుకులాల సమన్వయ అధికారి అంగడి మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఏజీ సెట్–2024లో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్ల భర్తీ ఉంటుందని పేర్కొన్నారు. బాలుర గురుకులాల్లోని 154 ఖాళీలు, బాలికల గురుకులాల్లోని 295 ఖాళీల భర్తీకి 1:3 నిష్పత్తిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలురకు సంబంధించి ఎస్సీ కేటగిరీలో 22 నుంచి 7,569 ర్యాంకు వరకు, ఎస్టీ కేటగిరీలో 261 నుంచి 5,730, బీసీలో 5 నుంచి 403, ఓసీ కేటగిరీలో 19 నుంచి 1,023 ర్యాంకు వరకు విద్యార్థులకు ఈ నెల 22న నార్పల మండలం బి.పప్పూరు గురుకులంలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

- బాలికలకు సంబంధించి ఎస్సీ కేటగిరీలో 57 నుంచి 19,371 ర్యాంకు వరకు, బీసీ(సీ) కేటగిరీలో 425 నుంచి 18,483 వరకు, ఎస్టీ 48 నుంచి 12,867, బీసీ 14 నుంచి 1,845, ఓసీ కేటగిరీలో 11 నుంచి 2,128 ర్యాంకు వరకు ఈ నెల 23న అనంతపురం రూరల్ మండలం కురుగుంట గురుకులంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం తొమ్మిది గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందన్నారు. మెరిట్ కార్డు, టెస్ట్ మార్కుల మెమో, ఆధార్ కార్డు, కులం, ఆదాయ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

సీబీఎస్‌ఈ సిలబస్ బోధన సులువే

- బోధనా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి
- టీచర్లకు ఆర్‌జేడీ రాఘవరెడ్డి సూచన



మాట్లాడుతున్న ఆర్‌జేడీ రాఘవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: అవగాహన ఉంటే సీబీఎస్‌ఈ సిలబస్ బోధన కూడా చాలా సులువుగానే ఉంటుందని పాఠశాల విద్య ఆర్జేడీ రాఘవరెడ్డి అన్నారు. సీబీఎస్‌ఈ బోధనాంశాలపై పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు శనివారం ముగిశాయి. సీబీఎస్‌ఈ సిలబస్ అమలుకు జిల్లాలో ఎంపిక చేసిన 49 పాఠశాలల నుంచి 113 మంది మ్యాథ్స్, సైన్స్ టీచర్లు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో ఆర్జేడీ రాఘవరెడ్డి, డీఈఓ మీనాక్షి, స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ ఇస్మాయిల్, డీవైఈఓ రంగస్వామి, జిల్లా కోఆర్డినేటర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొని ఉపాధ్యాయులకు బోధనలో అనుసరించాల్సిన వివిధ పద్ధతులు వివరించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

సీబీఎస్‌ఈ సిలబస్‌ను ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా ప్రవేశపెడుతున్నందున ఉపాధ్యాయులంతా అవగాహన పెంచుకుని విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని పాఠశాల విద్య ఆర్జేడీ రాఘవరెడ్డి సూచించారు. స్టేట్ సిలబస్‌కు, సీబీఎస్‌ఈ సిలబస్‌కు తేడా ఉంటుందన్నారు. బోధనతో పాటు మూల్యాంకనం కూడా ఎంతో ముఖ్యమన్నారు. అలాగే ఈ నెల 20, 21 తేదీల్లో ఇదే పాఠశాలలో ఇంగ్లిష్, బయాలజీ, సోషల్ సబ్జెక్టుల టీచర్లకు జిల్లా స్థాయి శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెళ్లింట.. మృత్యు గంట

10 రోజుల్లో నిఖా.. అంతలోనే విషాద గీతిక

- లారీని కారు ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి మృతి
- మరొకరికి గాయాలు
- వరుడి మృతితో రెండు కుటుంబాల్లో శోకం
- ముక్కుపచ్చలారని పిల్లల మృత్యువాత
- కన్నీరుమున్నీరైన బంధువులు
- శోకసంద్రంలో మునిగిన బిందెలకాలనీ

వారిది చాలా పెద్ద కుటుంబం. ఆ ఇంటాయనది పెద్ద మనసు. తన తమ్ముడు చనిపోతే వారి కుటుంబాన్ని అక్కున చేర్చుకుని పోషిస్తున్నారు. పెద్ద కుమారుడు ఇటీవల చనిపోగా ఆ ఇంటి మనుషులకూ అండగా నిలబడ్డారు. పిల్లల ఆలనా పాలనా చూస్తున్నారు. ఇటీవల చిన్న కుమారుడి నిశ్చితార్థం జరిగింది. దీంతో ఆ కుటుంబమంతా ఎంతో సంతోషంలో మునిగిపోయింది. పెళ్లిని ఘనంగా చేయాలని నిశ్చయించింది. పెళ్లి పత్రికలను ఇప్పటికే చాలా మందికి పంచింది. ఎంతో ఆనందంగా 'సాగిపోతున్నాం' అనుకుంటున్న తరుణంలో వారిని వెంటాడిన మృత్యువు.. ఒక్కసారిగా అందరినీ విషాద సాగరంలోకి నెట్టేసింది. ప్రమాదంలో వరుడు కూడా చనిపోవడంతో రెండు కుటుంబాలూ, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.



నుజ్జునుజ్జయిన కారును పరిశీలిస్తున్న పోలీసులు



కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలు

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ గ్రామ శివారు 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు దుర్మరణం పాలవడంతో జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. అనంతపురం నగరంలోని యల్లమ్మ వీధి బిందెల కాలనీకి చెందిన షేక్ అలీ సాహెబ్ (58) పామిడిలో గుజరీ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొన్ని రోజుల క్రితం తన తమ్ముడు మృతి చెందడంతో వారి కుటుంబాన్ని తన దగ్గరే ఉంచుకొని ఆలనాపాలన చూస్తున్నాడు. అదే విధంగా ఈ ఏడాది జనవరి 5న పెద్ద కుమారుడు రహంతుల్లా మృతి చెందగా, అతని భార్య షేక్ జాహిదాబాను (40), ఇద్దరు కుమారులు షేక్ మహమ్మద్ ఆహిల్ (6), షేక్ మహమ్మద్ అయాన్ (3)ను తనే పోషిస్తున్నాడు. కుమారుడు, కోడలు, మనవళ్లు, తమ్ముడి కుటుంబం కలసి 22 మంది ఒకే ఇంట్లో ఉంటున్నారు. అలీ సాహెబ్ చిన్న కుమారుడు షేక్ ఫిరోజ్‌బాషా (28) నగరంలోని ఓ బ్యాంకులో కాంట్రాక్టు ఉద్యోగిగా కొన్ని రోజుల క్రితం వరకూ పని చేసేవాడు. గుజరీ వ్యాపారం చూసుకోవాలని తండ్రి సూచించడంతో బ్యాంకు ఉద్యోగం మానేశాడు. తండ్రితో కలిసి రోజూ పామిడికి వచ్చి వ్యాపారం చూసుకుని వెళ్లేవారు.

ఘనంగా నిశ్చితార్థం..

తమ బంధువులకు చెందిన ఓ యువతితో ఫిరోజ్‌బాషాకు వివాహం చేయాలని అలీ సాహెబ్ నిశ్చయించారు. ఈ నెల 3న నిశ్చితార్థాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ నెల 28న వివాహాన్ని అత్యంత వైభవంగా చేయాలని అనుకున్నారు. అందులో భాగంగానే పెళ్లి బట్టలు, ఇతర వస్తువుల కొనుగోలు కోసం రెండు రోజుల క్రితం రెండు కార్లలో హైదరాబాద్ వెళ్లారు. షాపింగ్ ముగించుకున్న అనంతరం తిరుగుపయనమయ్యారు. ఒక కారులో అలీ సాహెబ్‌తో పాటు తమ్ముడి భార్య షేక్ రెహాన (44), కుమారుడు ఫిరోజ్‌బాషా, పెద్ద కోడలు షేక్ జాహిదాబాను, మనవళ్లు షేక్ మహమ్మద్ ఆహిల్, షేక్ మహమ్మద్ అయాన్ ఉండగా, మరో కారులో బంధువులు ఉన్నారు. బంధువులంతా శనివారం తెల్లవారు జాము 4 గంటలకే అనంతపురం వచ్చేశారు.అయితే, మనవళ్లు షేక్ ఆహిల్, షేక్ అయాన్ ఏడుస్తుండటంతో తాము ప్రయాణిస్తున్న కారును అలీ సాహెబ్ కర్నూలులో ఆపించారు. వారు నిద్రపోయాక ప్రయాణం ప్రారంభించారు. ఈ క్రమంలోనే గుత్తి మండలం కరిడికొండ గ్రామ శివారులోకి రాగానే డ్రైవర్ మహమ్మద్ గౌస్ నిద్ర మత్తులో తూగడంతో కారు అదుపు తప్పి డివైడర్ ఎక్కి అవతలి వైపునకు వెళ్లి కర్నూలు వైపు వెళ్తున్న ఓ లారీని వేగంగా ఢీకొంది. ప్రమాదంలో అలీ సాహెబ్, ఫిరోజ్, మహమ్మద్ ఆహిల్, మహమ్మద్ అయాన్‌లు ఘటనాస్థలిలోనే ప్రాణాలు విడిచారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న షేక్ రెహానను గుత్తి ఆసుపత్రికి, షేక్ జాహిదాబానును అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లగా వారు కూడా చికిత్స ఫలించక ప్రాణాలు విడిచారు. డ్రైవర్ గౌస్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, గుత్తి సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్‌ఐ నబీరసూల్ ఘటనా స్థలిని పరిశీలించారు. కారులో ఇరుక్కున్న మృతదేహాలను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. రక్తమోడుతున్న వారి ఎస్‌ఐ తన చేతులతో బయటకు తీశారు. ఫిరోజ్‌బాషా మృతదేహం బయటకు తీసే సమయంలో తల తెగి కింద పడిపోగా ఎస్‌ఐ తీసుకొచ్చి అంబులెన్సు సిబ్బందికి అందించారు. ఎస్‌ఐ చొరవను పలువురు అభినందించారు.




అనంతపురంలో మృతుల ఇంటి వద్ద కన్నీరుమున్నీరవుతున్న బంధువులు, మృతుల ఇంటి వద్ద గుమిగూడిన బంధువులు, స్థానికులు

ప్రమాదంలో మృతి చెందిన వారు



షేక్ అలీ సాహెబ్, షేక్ రెహాన, షేక్ జాహిదాబాను (ఫైల్)



పెళ్లి కుమారుడు షేక్ ఫిరోజ్‌తో షేక్ మహమ్మద్ ఆహిల్, షేక్ మహమ్మద్ అయాన్ (ఫైల్)

బిందెల కాలనీ కన్నీటి సంద్రం..

తమ కాలనీకి చెందిన ఆరుగురు మృతి చెందారనే వార్తతో బిందెలకాలనీ విషాదంలో మునిగిపోయింది. మృతదేహాల వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు గుండెలవిసేలా రోదించారు. వారిని ఓదార్చడం ఎవరి తరమూకాలేదు. తమ వెనకే వస్తారనుకున్న వారు ఎంతసేపటికీ తిరిగిరాకపోవడం, ఆ క్రమంలోనే మరణవార్త తెలియడంతో కారులో ముందు వచ్చిన వారంతా ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.

కుటుంబం మొత్తం మృతి..

అలీసాహెబ్ పెద్ద కుమారుడు రహంతుల్లా ఈ ఏడాది జనవరిలో మరణించగా, శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రహంతుల్లా భార్యతో పాటు ఇద్దరు కుమారులు మరణించారు. ఇక.. అలీ సాహెబ్ భార్య గతంలోనే మృతి చెందగా, ఇప్పుడు చిన్న కుమారుడు, అలీ సాహెబ్ కూడా ప్రాణాలు కోల్పోవడం అందరినీ కలచివేసింది.

మారాం చేసి.. మరణించి..

షాపింగ్ నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్తున్న మరిదికి, మామకు బాయ్ చెబుదామని జాహిదా కారు వద్దకు వచ్చారు. ఈ క్రమంలోనే ఆమె వెంట వచ్చిన కుమారులిద్దరూ తామూ వెళ్తామని మారాం చేయడంతో కాదనలేక పిల్లలతో కలిసి జాహిదా కారులో వెళ్లారు. ప్రమాదంలో ప్రాణాలు వదిలారు. ముక్కుపచ్చలారని ఇద్దరు పిల్లలను కూడా మృత్యువు కబళించింది.

సోదరుడి కుమారుడి దత్తత..

తన సోదరుడు కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందగా, అతడి కుమారుడైన గౌస్‌ను అలీసాహెబ్ దత్తత తీసుకున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కారును నడుపుతున్న గౌస్ కూడా గాయపడ్డారు.

స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత కట్టుదిట్టం



స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

- కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్
- కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి వెల్లడి
- ఆర్‌ఓలతో కలిసి స్ట్రాంగ్ రూంల పరిశీలన

హిందూపురం టౌన్/లేపాక్షి: ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. శనివారం వారు ఈవీఎం, వీవీ ప్యాట్‌లు భద్రపరిచిన హిందూపురం మండలంలోని బిట్ కళాశాల, లేపాక్షి మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లోని స్ట్రాంగ్ రూం ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతాపరమైన అంశాల్లో సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. స్ట్రాంగ్ రూంల పరిశీలనకు వచ్చినట్లు లాగ్ బుక్‌లో కలెక్టర్, ఎస్పీ సంతకాలు చేశారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ.. జిల్లాలోని 6 అసెంబ్లీ, హిందూపురం పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్స్ అత్యంత జాగ్రత్తగా భద్రపరిచామన్నారు. మడకశిర, కదిరి, పెనుకొండ, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు హిందూపురం పార్లమెంట్ స్థానానికి సంబంధించిన ఈవీఎం, వీవీ ప్యాట్స్‌ను 'బిట్' కళాశాలలోని స్ట్రాంగ్‌రూంలో భద్ర పరిచామని తెలిపారు. అలాగే లేపాక్షి సమీపంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని స్ట్రాంగ్‌రూంలో పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎం, వీవీప్యాట్స్ భద్రపరిచామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, స్ట్రాంగ్ రూంల వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. స్ట్రాంగ్ రూం ప్రాంతాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. అలాగే సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్ట్రాంగ్ రూం పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు అభిషేక్ కుమార్, అపూర్వ భరత్, భాగ్యరేఖ, వెంకట శివసాయిరెడ్డి, గౌరీ శంకర్, పలువురు డీఎస్పీలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల 'పచ్చ'పాతం

- 'పది' స్పాట్ రెమ్యునరేషన్‌పై ధన్యవాదాలు తెలిపిన టీచర్ల సంఘ నేత సస్పెన్షన్
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ పత్రికలకు ఎక్కిన వారిపై చర్యలు నిల్
- టీడీపీకి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న టీచర్లనూ పట్టించుకోని అధికారులు
- ఆధారాలతో సహా ఫిర్యాదులందినా వెనకేసుకొస్తున్న వైనం
- విద్యాశాఖలో కీలక అధికారి నిర్వాకం
- ఒక వర్గాన్నే లక్ష్యంగా చేసుకుని చర్యలు!



ధర్మవరం ఫెసిలిటేషన్ కేంద్రంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్ హల్‌చల్ (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: ఎన్నికల నియమావళిని పారదర్శకంగా అమలు చేయాల్సిన ఉమ్మడి జిల్లాలోని పలువురు విద్యాశాఖ అధికారులు 'పచ్చ' పాతం ప్రదర్శించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడారని, పోస్టల్ బ్యాలెట్ల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని, టీడీపీకి మద్దతుగా బహిరంగ ప్రచారం చేసినట్లు ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా కనీస చర్యలు తీసుకోని అధికారులు 'ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదే' అన్న ఓ టీచరుపై మాత్రం సస్పెన్షన్ వేటు వేశారు. అనంతపురం జిల్లా విద్యాశాఖలోని ఓ కీలక అధికారి ఒక వర్గాన్నే లక్ష్యంగా చేసుకుని చర్యలు తీసుకున్నారనే విమర్శలు పెద్ద ఎత్తున వస్తున్నాయి.

రెమ్యునరేషన్ పెంచడం సంతోషం అన్నందుకు సస్పెన్షన్

ఎప్పుడూ లేనివిధంగా పదోతరగతి స్పాట్ రెమ్యునరేషన్ పెంచుతూ గతేడాది ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై మార్చి 23న 'సాక్షి'లో 'పది స్పాట్ రెమ్యునరేషన్ భారీగా పెంపు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. పదేళ్ల తర్వాత అన్ని కేడర్ల ఉద్యోగులకూ రెమ్యునరేషన్ పెంచడం సంతోషదాయకమని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి ఈ సందర్భంగా పేర్కొనగా.. నెల తర్వాత దీనిపై గుర్తు తెలియని వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే నోటీసు ఇవ్వకుండా, కనీసం విచారణ చేయకుండా ఏప్రిల్ 29న పి.అశోక్‌కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి రెమ్యునరేషన్ వివరాలను డీఈఓ వరలక్ష్మీ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ కూడా వెల్లడించినట్లు ఇదే కథనంలో ఉంది. టీచరు అశోక్‌కుమార్ రెడ్డికి వర్తించిన నిబంధన ఈ ఇద్దరు అధికారులకు వర్తించవా.. అని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. టీచరుకో న్యాయం? అధికారులకో న్యాయమా? అనే చర్చ జరుగుతోంది.

టీడీపీకి మద్దతుగా ప్రచారం చేసినా... చర్యల్లేవ్!

కళ్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలం కుర్లగుండ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న రాఘవేంద్రగుప్తా, నాగిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న వై.మంజునాథ్‌లు టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇలా టీడీపీకి కొమ్ముకాస్తున్న వీరి ద్వారా బ్రహ్మసముద్రం ఎంఈఓ పోస్టల్ బ్యాలెట్ ఆర్డర్ కాపీలను టీచర్లకు పంపిణీ చేశారు. వాస్తవంగా ఈ కాపీలను నేరుగా ఆయా టీచర్లకు అందజేయాల్సి ఉన్నా, ఎంఈఓ నిబంధనలు ఉల్లంఘించారు. దీనిపై పలువురు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా.. అశోక్‌కుమార్ రెడ్డి విషయంలో ఎలాగైతే చర్యలు తీసుకున్నారో.. ఆ విధంగానే ఈ ముగ్గురిపైనా చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించింది. కమిషన్ ఆదేశానుసారం చర్యలకు ఉపక్రమిస్తూ ఫైలును సిద్ధం చేయగా, చివరి నిమిషంలో ఓ కీలక అధికారి అడ్డుపడినట్లు తెలిసింది. ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద ఓ వర్గం టీచర్లు, సంఘాల నాయకులు కనిపిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలంటూ సదరు అధికారి కొందరికి ఆదేశాలిచ్చినట్లు కూడా సమాచారం.

- ఇక శ్రీసత్యసాయి జిల్లాలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు చంద్రశేఖర్, రామ్మోహన్, హరిప్రసాద్‌రెడ్డి ఓ పత్రికలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రకటనలు చేసినా వారిపై కనీస చర్యలు తీసుకోలేదు.
- ధర్మవరం నియోజకవర్గంలో ఓటరు కానప్పటికీ అక్కడి ఫెసిలిటేషన్ కేంద్రానికి వెళ్లిన ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోకుకుమార్ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ప్రభావితం చేస్తూ హల్‌చల్ చేశాడు. బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌కు అనుకూలంగా ఓట్లు వేయాలంటూ బహిరంగంగానే ప్రచారం చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈయనపై కూడా చర్యలు తీసుకోలేదంటే విద్యాశాఖలోని పలువురు అధికారులు ఎంతగా 'పచ్చ' పాతం ప్రదర్శించారో అర్థమవుతుంది.



వర్షంతో పుట్టపర్తిలో జలమయమైన రహదారి



బత్తలపల్లిలో జలమయమైన వీధి

కరుణించిన వరుణుడు

- జిల్లాలోని 16 మండలాల్లో మోస్తరు వర్షం
- వేరుశనగ సాగుకు రైతన్నలు సమాయత్తం



రొళ్ల మండలం దొడ్డేరి సమీపంలో పారుతున్న వంక

పుట్టపర్తి అర్బన్/బత్తలపల్లి: భగభగ మండే ఎండలతో అల్లాడిపోయిన ప్రజలను వరుణుడు కరుణించాడు. తొలకరితో పలకరించి ఆనందింపజేశాడు. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం దాకా జిల్లాలోని 16 మండలాల్లో వర్షం కురిసింది. రొద్దం మండలంలో అత్యధికంగా 60.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తనకల్లులో 54.6, గాండ్లపెంట మండలంలో 52.4, మడకశిరలో 51.6 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. అలాగే నల్లచెరువులో 29 మి.మీ, కదిరిలో 28.2, లేపాక్షిలో 22.6, బత్తలపల్లిలో 16.4, గుడిబండలో 12.2, తాడిమర్రిలో 10.8, ఎన్పీ కుంటలో 8.6, అమరాపురంలో 6.8, కనగానపల్లి, రామగిరి మండలాల్లో 4.2, తలుపుల, హిందూపురం మండలాల్లో 2.2 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. శనివారం సాయంత్రం పుట్టపర్తి, బత్తలపల్లిలో మోస్తరు వర్షం కురవడంతో రహదారులు జలమయమయ్యాయి. తాజా వర్షాలతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఖరీఫ్‌కు పొలాలు సిద్ధం చేసుకునేందుకు ఈ వర్షాలు చాలా ఉపయోగకరమని రైతులు చెబుతున్నారు. వేరుశనగ సాగుకు సమాయత్తం అవుతున్నారు.

క్లుప్తంగా

అడవి జంతువుల దాడిలో 36 గొర్రెల మృతి



మృత్యువాత పడిన గొర్రెలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి కేశవనాయక్

గాండ్లపెంట: కటారుపల్లి గొల్లపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి అడవి జంతువుల దాడిలో 36 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో రెండు పొట్టేళ్లు, మూడు గొర్రెలకు పొట్టపై గాయాలయ్యాయి. వల్లెపు ఆదినారాయణ గొర్రెల కాపరి. రోజూ గొర్రెలను మేతకు తీసుకెళ్లి సాయంత్రం గొర్రెల దొడ్డిలో వదిలేవాడు. రాత్రివేళ గొర్రెల మంద వద్దే నిద్రించేవాడు. శుక్రవారం రాత్రి చినుకులు పడుతుండటంతో గొర్రెలదొడ్డిలో జీవాలను వదిలి ఇంటికి వెళ్లాడు. రాత్రి పది గంటలకు ఒకసారి, 12 గంటలకు మరొకసారి వచ్చి మందను చూసి తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. శనివారం తెల్లవారుజామున ఐదు గంటలకు వచ్చి చూడగా జీవాల్లో 36 గొర్రెలు పీకల వద్ద గాయాలై చనిపోయి ఉండడం, మరో రెండు పొట్టేళ్లు, మూడు గొర్రెలకు పొట్టపై గాట్లు పడి ఉండటం చూసి ఆదినారాయణ కన్నీటి పర్యంతమయ్యాడు. అప్పులు చేసి గొర్రెలు పెంపకం చేపడితే ఇలా అయ్యిందే అని విలపించాడు. దాదాపు రూ.5లక్షల దాకా నష్టం వాటిల్లిందని తెలిపాడు. గత నెలలో ఎండ వేడిమికి తట్టుకోలేక 19 గొర్రెలు మృతి చెందాయని, అప్పుడు రూ.2లక్షల దాకా నష్టం వాటిల్లిందని చెప్పాడు. తనను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు కోరాడు. మృత్యువాత పడిన గొర్రెలను శనివారం మండల పశువైద్యాధికారి కేశవనాయక్ పరిశీలించారు. వాటికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు.

అనంత ఎస్పీగా గౌతమి శాలి



అనంతపురం: అనంతపురం నూతన ఎస్పీగా గౌతమి శాలి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. గౌతమి శాలి 2015లో ఐపీఎస్ అధికారిణిగా ఎంపికయ్యారు. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తికి సమీపంలోని పెద్ద కన్నెలి స్వగ్రామం. ఎస్వీ యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేశారు. ఐపీఎస్‌గా ఎంపిక కాక ముందు చెన్నైలోని కాగ్నిజెంట్ టెక్నాలజీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశారు. గతంలో విశాఖపట్నం డీసీపీ-1గా, అనకాపల్లి ఎస్పీ, బొబ్బిలి ఏఎస్పీ, కర్నూలు ఏఎస్పీ (సెబ్, అడ్మినిస్ట్రేటివ్)గా విధులు నిర్వహించారు.

సృజనాత్మకత, విజ్ఞానం పెంపే లక్ష్యం

- వేసవి సెలవుల్లో విద్యార్థులకు చక్కటి అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 70 గ్రంథాలయాల్లో విజ్ఞాన శిబిరాలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు
- జూన్ 7 వరకు శిబిరాల కొనసాగింపు



పుట్టపర్తి గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

పుట్టపర్తి టౌన్: వేసవి సెలవులను విద్యార్థులు వృథా చేసుకోకుండా వారిలో విజ్ఞాన, సాంస్కృతిక, సృజనాత్మకత పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేసింది. రాష్ట్ర పౌర గ్రంథాలయ సంస్థ 'సమ్మర్ క్యాంప్' పేరుతో గ్రంథాలయాల్లో విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు ఈ నెల 15న విజ్ఞాన శిబిరాలు ప్రారంభమయ్యాయి. జూన్ 7 వరకు 40 రోజుల పాటు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరాలు కొనసాగనున్నాయి.

రెండు విభాగాల్లో నిర్వహణ

పఠనం, సరదా అనే రెండు విభాగాల్లో శిక్షణ ఉంటుంది. ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు కథలు చెప్పడం, 8.30 నుంచి 9 వరకు పుస్తక పఠనం, 9 నుంచి 9.30 వరకు డ్రాయింగ్, 9.30 నుంచి 10 వరకు స్పోకెన్ ఇంగ్లిష్, 10 నుంచి 10.30 వరకు విరామం, 10.30 నుంచి 11 వరకు కథలు చెప్పడం , 11 నుంచి 11.30 వరకు అతిథులతో స్ఫూర్తిదాయక ప్రసంగాలు, 11.30 నుంచి 12 గంటల వరకు నృత్యాలు, నాటికలు, బొమ్మల తయారీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విజేతల పుస్తకాలతో పాటు కవులు, స్వతంత్ర సమరయోధుల జీవిత విశేషాలు, వివిధ దినపత్రికలు, చిన్నారులకు ఉపయోగపడే పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచారు. స్పోకెన్ ఇంగ్లిష్, చెస్, డ్రాయింగ్, తెలుగులో మంచి ప్రతిభ ఉన్నవారు విజ్ఞాన శిబిరాల్లో సేవలందించవచ్చు.

ఉమ్మడి జిల్లాలో 70 శిబిరాలు

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో 70 గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన కేంద్రాలు నిర్వహిస్తున్నారు. 2,200 మంది విద్యార్థులు శిబిరాల్లో కథలు, వినటం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పడం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్, థియేటర్ ఆర్ట్స్ , వంటి సృజనాత్మకత ప్రక్రియలు నేర్చుకొంటున్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు కూడా శిక్షణ ఇస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



వేసవి సెలవుల్లో విద్యార్థులకు గ్రంథాలయాల్లో విజ్ఞాన శిబిరాలు నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 70 గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేశాం. విద్యార్థులు సద్వినియోగం చేసుకొంటున్నారు. ప్రత్యేక ఉపాధ్యాయులను కూడా ఏర్పాటు చేశాం. విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తకాలు చదవడం డ్రాయింగ్ వేయడం వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నాం . ఇంకా స్వచ్ఛందంగా ముందుకొచ్చే ఉపాధ్యాయుల సేవలను కూడా ఉపయోగించుకుంటాం.

– రమ, ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

విద్యార్థులకు ఎంతో ఉపయుక్తం



గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగం. ఆటలు, పాటలు, చదవడం, రాయడం, చిత్రలేఖనం వంటివి నేర్చుకుంటున్నాం. కొత్త కొత్త విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఎంతో ఆనందంగా ఉంది.

– ఐశ్వర్య, 8వ తరగతి విద్యార్థి, పుట్టపర్తి

అన్నదాతలకు ప్రేమతో..

రూ.356 కోట్ల 'ఇన్‌పుట్ సబ్సిడీ' విడుదల

- రైతుల ఖాతాల్లో జమవుతున్నట్లు అధికారులు వెల్లడి
- ఈ ఐదేళ్లలో ఇన్‌పుట్ కింద 'అనంత' రైతులకు రూ.486 కోట్లు
- సీజన్ ముగిసేలోపు రైతు ఖాతాకు ఠంచన్‌గా పెట్టుబడి రాయితీ
- చంద్రబాబు కుట్రతో లేటుగా 'ఇన్‌పుట్'

అనంతపురం అగ్రికల్చర్: ఎన్నికలకు ముందుగానే రైతుల ఖాతాల్లోకి జమ కావాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ (పెట్టుబడిరాయితీ) ఎట్టకేలకు శనివారం విడుదల చేశారు. రూ.356 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అందివ్వాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాలా ముందుచూపుతో వ్యవహరించారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ వస్తుందని సంక్షేమ కేలెండర్‌కు కాస్త ముందుగానే బటన్ నొక్కి సాంకేతిక పరంగా ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. అయితే రైతులకు ఇన్‌పుట్ విడుదల కాకుండా టీడీపీ అధినేత చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నేతలు కుట్ర పన్నడంతో ప్రక్రియ ఆగిపోయింది. పోలింగ్ ముగియడంతో తాజాగా ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేశారు.

2.86 లక్షల మందికి..

2023 ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లా పరిధిలో 47 మండలాలను కరువు జాబితాలో చేర్చిన నేపథ్యంలో ఇన్‌పుట్ మంజూరైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2.86 లక్షల మంది రైతుల ఖాతాల్లో పరిహారం నగదు జమ కావడం ప్రారంభమైందని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. అనంతపురం జిల్లాకు సంబంధించి 1,9,970 మంది రైతులకు రూ.251.20 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 1,17,005 మంది రైతులకు రూ.105.03 కోట్లు జమ కానుందని పేర్కొన్నారు.



నాలుగేళ్లూ కరువు తీరేలా వర్షాలు..

వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి నాలుగేళ్లు కరువు తీరేలా వర్షాలు కురిశాయి. గతేడాది మాత్రం వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అతివృష్టి అయినా, అనావృష్టి సంభవించినా రైతులకు చేయాల్సిన సాయంలో ఎన్నడూ జగన్ సర్కారు వెనుకడుగు వేయలేదు. రైతులు ఇబ్బంది పడకుండా అనుకున్న సమయానికి ఠంచన్‌గా పరిహారం అందజేస్తున్నారు. రైతు భరోసా-పీఎం కిసాన్, వైఎస్సార్ ఉచిత పంటల బీమాతో ఓ వైపు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. మరోవైపు పంటలు కోల్పోయిన రైతులకు కూడా పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించి ఆదుకున్నారు. అది కూడా సీజన్ ముగిసేలోపు ఆర్థిక సాయం అందించడం గమనార్హం. 2021, 2022లో కుండపోత వర్షాల కారణంగా అక్కడక్కడ వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. ఇక 2023లో వర్షాలు లేక పంటలు దెబ్బతినడంతో రైతులకు నష్టం వాటిల్లకుండా ఇన్‌పుట్‌తో ఆదుకున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో గత ఐదేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి 40,00,637 మంది రైతులకు ఏకంగా రూ.485.94 కోట్ల మేర ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారు. అందులో అనంతపురం జిల్లాలో 2,65,290 మంది రైతులకు రూ.364.85 కోట్లు, 'శ్రీసత్యసాయి'లో 1,35,347 మంది రైతులకు రూ.121.08 కోట్లు అందించారు.

అర్హులందరికీ బీసీజీ వ్యాక్సిన్ వేయాలి



గుట్టూరు ఆస్పత్రిలో వ్యాక్సినేషన్ వివరాలు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ మంజువాణి

పెనుకొండ: అర్హులైన ప్రతి ఒక్కరికీ బీసీజీ వ్యాక్సిన్ వేయాలని డీఎంహెచ్ఓ మంజువాణి వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం ఆమె గుట్టూరు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంతవరకూ ఎంతమందికి బీసీజీ వ్యాక్సిన్ వేశారన్న విషయాన్ని రికార్డులు చూసి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, 60 ఏళ్ల వయస్సు పైబడిన వారు, మధుమేహంతో బాధపడుతున్న వారు తప్పకుండా బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవాలన్నారు. దీనివల్ల వారికి భవిష్యత్తులో ఎంతో మంచి జరుగుతుందన్నారు.

యువకుడి బలవన్మరణం



ఆత్మహత్య చేసుకున్న శివ

గోరంట్ల: మండల కేంద్రంలోని రెడ్డివారి వీధిలో నివాసం ఉంటున్న ఎరికల శివ (36) బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కుటుంబ కలహాల నేపథ్యంలో ఎరికల శివ భార్య అలిగి మూడు నెలల క్రితం తన పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన శివ శుక్రవారం రాత్రి ఇంట్లోనే పైకప్పునకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి చెన్నమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (విజయవాడ)లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ డైరెక్టర్ శేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి విద్యార్హతతో డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ, బీఎస్సీ విద్యార్హతతో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ పెరాస్సింగ్ అండ్ టెస్టింగ్ కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు cipet24.online-registrationfor.org వెబ్‌సైట్‌లో ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కూడా కల్పించిందని వివరించారు. మరిన్ని వివరాలకు 63001 47965 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సాఫ్ట్‌బాల్‌లో ఎస్కేయూకు బంగారు పతకం



ఎస్కేయూ సాఫ్ట్‌బాల్ జట్టు

అనంతపురం: అఖిల భారత అంతర్ వర్సిటీ సాఫ్ట్‌బాల్ పోటీల్లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) జట్టు ప్రతిభచాటి బంగారు పతకం దక్కించుకుంది. 43 సంవత్సరాల యూనివర్సిటీ చరిత్రలో తొలి సారి బంగారు పతకం సాధించడం విశేషం. ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు బెంగళూరు యూనివర్సిటీ ఆధ్వర్యంలో సౌందర్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఈ టోర్నీ నిర్వహించారు. ఇందులో దేశ వ్యాప్తంగా 90 జట్లు పాల్గొన్నాయి. ఈ జట్టుకు కోచ్‌గా ఎస్కేయూ క్యాంపస్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ వెంకటేష్ వ్యవహరించారు. బంగారు పతకం సాధించిన జట్టు సభ్యులను ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కె.హుస్సేన్‌రెడ్డి, యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రెటరీ డాక్టర్ ఎంవీ శ్రీనివాసన్ అభినందించారు. టోర్నీలో ఉత్తమ పిక్చర్‌గా షేక్ చిన్న మస్తాన్, బెస్ట్ బ్యాటర్‌గా బి. రాంబాబులకు అవార్డులు వరించాయి.

పీఏబీఆర్‌లో తగ్గిన నీటిమట్టం

కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం పూర్తిగా తగ్గుముఖం పట్టింది. జలాశంలో ఏర్పాటు చేసిన అనంత, సత్యసాయి, శ్రీరామిరెడ్డి, ఉరవకొండ తాగునీటి ప్రాజెక్టులకు రోజుకు సుమారు 55 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శనివారం నాటికి డ్యాంలో 1.04 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జేఈ లక్ష్మీదేవి తెలిపారు.

చెన్నకేశవా..కరుణ చూపవా



స్వామి వారి రథాన్ని లాగుతున్న భక్తులు

- వైభవంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు
- కల్పవృక్ష, హనుమద్ వాహనాలపై దర్శనమిచ్చిన స్వామివారు

ధర్మవరం రూరల్: భక్తుల జయజయ ధ్వనాలు... అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మేళతాళాల సందడి మధ్య లక్ష్మీ చెన్నకేశవస్వామి పట్టణంలో ఊరేగారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారు కల్పవృక్ష వాహనంపై, సాయంత్రం హనుమద్ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. విశేషాలంకరణలో దేవేరులతో కలిసి దర్శనమిచ్చిన స్వామివారిని చూసి భక్తులు...చెన్నకేశవా..కరుణ జూపవా అంటూ వేడుకున్నారు. ఆలయ ఈఓ వెంకటేశులు, రతోత్సవ కమిటీ అధ్యక్షుడు దాశెట్టి సుబ్రమణ్యం, అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు, బానుప్రకాష్, చక్రధర్‌ల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పోరాళ్ల పుల్లయ్య బృందం ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు అందర్ని ఆలరించాయి. వేడుకలను తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

'సెంట్రల్' వర్సిటీ కోర్సులపై ఆరా



క్యాంపస్‌ను పరిశీలిస్తున్న విద్యాశాఖ కార్యదర్శి కె.సంజయ్‌మూర్తి

అనంతపురం: అనంతపురం సమీపంలోని జంతలూరు వద్దనున్న సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ క్యాంపస్‌ను శనివారం కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కె.సంజయ్‌మూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి ప్రొఫెసర్లను పరిచయం చేశారు. అనంతరం క్యాంపస్‌లో మొక్కలు నాటారు. నూతన జాతీయ విద్యా విధానం-2020 అమలు తీరుపై ఆయన ప్రశంసించారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి జంతలూరు క్యాంపస్‌లో నిర్వహించే కోర్సులపై ఆరా తీశారు.



బాలవికాస్ విద్యార్థుల నృత్య ప్రదర్శన



సంగీత కచేరి నిర్వహిస్తున్న తమిళనాడు భక్తులు

అలరించిన సంగీత కచేరి

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా తమిళనాడులోని వివిద భాగాలకు చెందిన 1300 మంది సత్యసాయి భక్తులు పుట్టపర్తి ప్రశాంతి నిలయం చేరుకున్నారు. శనివారం ఉదయం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత 'భారత్ దర్శన్' పేరుతో దేశంలోని అన్ని భాషలలో భక్తిగీతాలు ఆలపిస్తూ నిర్వహించిన సంగీత కచేరి అలరించింది. సాయంత్రం 'శ్రీ సత్యసాయి లీలామృతం' పేరుతో తమిళనాడు బాలవికాస్ విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.